

పరుసవేది

డాక్టర్ పి.వి.రమణ

చీకటి గూడులో కుమిలిపోతున్న వెలుగు. ఆ వెలుగును వెలికి తేవాలనే ప్రయత్నంలో చీకటిని వేటాడే లారీ కళ్ళు. రెక్కలు తెగిన పక్షి పైకెగరటానికి చేసే విఫల ప్రయత్నంలాటిదే ఆ వేట. గతుకుల రోడ్డు. రంగసామి చేతుల్లో ఆటబొమ్మలా ఆడుతున్న లారీ. పగలు అభయహస్తాన్ని చాపి చలువ దీవెనలిచ్చే చెట్లు, భయంకరంగా నిల్చున్నై. మంత్రోచ్చారణ చేసే మునుల్లా వింత శబ్దాలను వల్లిస్తున్నాయి. ఈ యుగాల తిరుగుడు తనవల్ల కాదన్నట్లు క్షీణించిపోయిన చంద్రుడు. లారీ కళ్ళు గక్కే వెలుగు రేఖల్లో క్షణకాలం స్ఫటికం పారల్లా కన్పించే రోడ్డు, ఆ రేఖలు దాటగానే మరింతగా అంధకార కూపంలో కూరుకుపోతూంది.

దూరంగా ... ఆ చీకటి వెలుగుల వింత మిశ్రమంలో ... ; అద్దంలోనుండి మత్తు కళ్ళను చికిలించుకొంటూ, ముద్ద కట్టుకుపోతున్న ఒళ్ళును విదిలించుకొంటూ చూశాడు రంగసామి. బంగారు లేడి దొరికినట్లు రంగసామి మనసు రెపరెపలాడింది. మత్తుతో కుస్తీ పట్టీ పట్టీ సుస్తీ చేసినట్లు నిల్చిపోయిన రెప్పలు తిరిగి కొట్టుకొన్నై. నరనరంలో సంచలనం. రంగసామి నేదో ఆవహించబోతున్నది. నేలను నలుపుకొంటూ, కీచుమంటూ ఆగింది లారీ.

"ఎక్కడికి పోతున్నది లారీ ?" మోహన్ ప్రశ్నలో ఆరాటం. ప్రక్కన యువతి. కాదు; వెర్రిగా కురిసే చీకటిలో వెలిగిపోయే మెరుపు. కూరుకుపోయిన రంగసామి కనురెప్పలు విశాలమైనై. దృష్టి మెరుపుపై నిల్చింది. అయస్కాంతానికి అతుక్కుపోయిన ఇనుపముద్ద రంగసామి.

"ఈ లారీ ఎటుపోతూంది ?" మళ్ళీ ప్రశ్నించాడు మోహన్.

"ఎందుకు ?" అతుక్కుపోయిన రంగసామి పెదాలు విడివడ్డాయి తిరుగిలి రాళ్ళలా.

"ఆఖరి బస్ తప్పిపోయింది. అర్జంటుగా హైద్రాబాద్ పోవాలి."

"ఇది ఆ వైపే"

"ఎంత డబ్బైనా ఇస్తాను. మా ఇద్దర్నీ హైద్రాబాద్ చేర్చు."

"ఎక్కండి."

లారీ పోతున్నది. అలలు అలలుగా చీకటి. అల్పంగా దాన్ని చీలుస్తూ హెడ్‌లైట్స్ వాడి కత్తులు; తెగిపోతున్న చీకటి శరీరం. మళ్ళీ అతుక్కుపోతున్న అంధకారం.

"రాజీ, ఏమిటిది... 'ధైర్యంగా ఉండాలి" అనునయిస్తూ మోహన్.

"ఊహుఁ... నావల్లకాదు మోహన్; నేనుండలేను" ఏడుపును బిగపడుతూ రాజీ.

"చూడు రాజీ... అవకాశాలు మనమనుకొన్నప్పుడల్లా రావు. నాకుమాత్రం నిన్నొదిలి వేరే దేశం పోవాలని ఉందా ?" వేదనలో నిమజ్జనమవుతున్న రాజీ... వెక్కిళ్ళతో ఎగసిపడుతున్న రాజీ... వియోగాన్ని తల్చుకొని విలపించిపోతున్న రాజీ...

"పోనీ ఉండిపోవా ?"

అంత బాధలోనూ తల అడ్డంగా ఊపింది రాజీ. మోహన్ గుండెలమీద చూపుడువేలితో వ్రాస్తూ అంది –

"వెళ్ళాలి."

"మరి"

"ఇక ఏడవను."

"రాజీ..."

"ఈ జీవితమంతా ఇట్లాగే ఉండిపోనీ... నీ వాడిలోనే వాదిగిపోనీ" ఊగిసలాడే గుండెల్తో అంది రాజీ. యుగయుగాలనుండీ హత్తుకుపోయిన అనుబంధాల మధుర ప్రేమార్చనా ఫలం; నీలాకాశాలు, అగాధ సాగరాలు, గిరి శిఖరాలు, అనంతలోయలు మరెన్నో ప్రకృతి మనోహర కిరీటాలపైన మనోజ్ఞంగా విన్పించే తీయని గానం; తళతళలాడే వెన్నెల ఆప్యాయతా పలుకరింత – ఇదే ప్రేమ అయితే అదిప్పుడు రాజీ, మోహన్‌ల పారవశ్య పంజరంలో బందీ. రాజీ ఇప్పుడొక వెన్నెలరేఖ. ఈ భువికి జారిపడ్డ చందమామ ముక్క.

"రాజీ... చిన్నప్పుడు చూసి నవ్వుకొనేవాళ్ళం, పొట్టను కరచిపెట్టుకొన్న పిల్లతోసహా కోతి ఎగరటం... నీవూ అట్లానే" రాజీ వీపుమీద





మతారంగా స్పృశిస్తూ మోహన్. రాజీ నవ్వింది ముద్దదీపంలా. ఆవరించిన అంత చీకట్లోనూ చిరువెలుగు.

అడవి... దాహం...మోహదాహం... కామం... రాక్షసి కామం... రంగసామి నరాలలో హోరు; కాబిన్ వేడి; నరాల వేడి... కామదాహం వేడి... తాపం... కాగిపోయే దేహం...పరకాంతతో పరవశించి పోవాలన్న పైశాచిక ప్రవృత్తి... ప్రకోపం... వెర్రిగా కురిసే చీకటి... మరింత వెర్రిగా చీలిపోయిన సృష్టి; మోహన్ వడిలో వొదిగిన రాజీ... కామస్వారలతో కప్పుకుపోతున్న రంగసామి... గాజు పెంకులు... రత్నాల కుప్పలు... మసిబొగ్గు... మంచుధార... నిప్పు... నీరు... త్యాగం... స్వార్థం... ఓహ్ రంగసామీ; రాకాసి కొడకా... స్టీరింగ్‌మీద ఒక్క గుద్దు గుద్దాడు రంగసామి ఆలోచన త్రాచులు కాటు వేస్తుంటే;

రాజీ అదిరిపడింది. మోహన్‌లో కంగారు. కంట్రోలు తప్పిన స్టీరింగ్; రోడ్డు అంచువరకూ వెళ్ళి మళ్ళీ రోడ్డుమీదకు వచ్చింది లారీ.

"ఏమిటి ? ఏమైంది ?" ఆత్రంగా అడిగాడు మోహన్

ఏమీలేదన్నట్లు తలాడించాడు రంగసామి.

"నిద్ర వస్తున్నదా ?"

మళ్ళీ అడ్డంగా తలూపాడు రంగసామి.

కాబిన్ వేడి...రాజీ నిశ్వాసాలవేడి...రంగసామి సగం విరిగిన చూపులు రాజీమీదే లైటు వెల్తుర్లో గమనించింది రాజీ...భర్త ప్రక్కనున్న స్త్రీలవైపు ఇవేం చూపులు ... భయంకరంగా...అసహ్యంగా ... "అందుకే ఇటువంటి మనుష్యులంటే తనకు ఏవగింపు" తనలో తనే గొణుక్కొంది రాజీ.

లారీ ఆపాడు రంగసామి. రోడ్డుమీది టీ బట్టీ వైపు నడిచాడు. లారీపై నుండి క్లీనరూ దిగి రంగసామి ననుసరించాడు. 'ఛాయ్' తాగబోయాడు రంగసామి.

"ధూ ... నీవ్వ...ఏందిది ? ఇది ఛాయవా ... ఏందీ రంగు ?" ఛాయ్‌వైపు పరీక్షగా చూశాడు రంగసామి; పట్టీ పట్టీ చూశాడు.

"ఎవరిదీ బొమ్మ ... అవును ... కాబిన్‌లోని మెరుపు బొమ్మదే" ఆత్రంగా ఒక గుటకవేశాడు; ఆనందంగా మళ్ళీ గ్లాసువైపు చూశాడు. "అరె ... బొమ్మ మారింది ... ఎవరిది ? లచ్చిదా ... మా

ప రు స వే ది

లచ్చిదే...!" గ్లాసువైపు పిచ్చి పటినట్లు చూస్తుండి పోయాడు రంగసామి. రంగసామి మనసు మైకప్పొరలు చీలుకుపోతున్నై. తైతక్కలాడుతూ గతం తాలూకు క్రీడలు ...

"మామా !"

"........."

"విన్నే ... ఏటది ఉలకవ్ ?"

"ఏటో సెప్పరాదు" విసుక్కొన్నాడు రంగసామి.

"వోనరు బాబుకు ఓ మాట సెప్పరాదూ !"

"ఏటది ?"

"రాతిరేల డూటీ ఏయొద్దని."

"ఎందుకేటి ?"

"నే నొక్కత్తినే ఈడ; నా కేటోగా ఉంటది... బయంగా, ఎలితిగా ఉంటది... బాదగా ఉంటది... బరువెట్టినట్టుంటది."

"నే సేయకపోతే డూటీ మరెవడు సేస్తాడే నీ మొగుడు." లచ్చిమి ఆ ఆరాటంలోనూ అబ్బురంగా నవ్వింది. కొలనులో తామరపూరేకులు ఊగినట్లు. . కరెంట్ బల్బు ఆరి వెలిగినట్లు.

"ఎందుకేటి ఆ యెకసెకం ?"

"ఎకసెకం కాదు మామా... ఏడుకేసి నవ్వా. నా మగని సెమత్కారం చూసి నవ్వా."

"ఏందా సెమత్కారం ?"

"ఎవుడు సేస్తాడు రాత్రేల డూటీ నా మగడి కంటే."

"వూ... కూతలవడింది."

"మరి సెప్తావా మామా... వోనరు బాబుకు."

"ఎందే సెప్పేది ? రాత్రేల డూటీలో సుకం నీకేం తెలుసుద్దే."

"అవున్లే... నాకేం తెలుసుద్ది... కడుపునిండా సారా... కావాల్సిందాంతో ఎకసెకం... నీకూ ఓ యిల్లుందనీ, ఇంటిది...అగ్గిసాచ్చిగా మనువాడింది ఎదురు సూత్తావుంటదనీ నీవు ఆలోసిత్తేగా ? ఆ అవుసరం నీకొత్తేగా... నా అదురుట్టమిది; పవలు, రేత్రి యిసయం తెలీని ఎర్రిబతుకు... పోనీ పగటేలన్నా పది నిముసాలు ఇంటికాడుంటావా అంటే అదీలేదు..."

"ఏంటేవ్ నీయవ్వ... లారీ ఇరిగే లోడెత్తన్నావ్..."

"నా రాత" నిట్టూర్చింది లచ్చి.

"ధూ నీవ్వ వాయి" గ్లాసు విసిరికొట్టాడు రంగసామి.

టీ బట్టీ ఊగిపోయింది; దాని యజమాని తికమకపడ్డాడు. గ్లాసు పగిలే పగిలింది. దాన్ని గూర్చి అడిగితే తన బుర్రే పగలొచ్చు. పగిలిన ముక్కలవైపు చూస్తుండిపోయాడు యజమాని. రంగసామి లారీవైపు బయలుదేరాడు. గతం గుండెల్ని రాపిడిపెట్టే పీడకల; ఆ జీవితం నిరంతరం రాజుకొనే నిప్పులకుండ. గడ్డకట్టిన స్వార్థం తాలూకు కాఠిన్యం... ముద్రలు పడ్డ కామం కోరలు" కాబిన్ డోరు తెరచి లారీలో కూర్చొన్నాడు రంగసామి. లారీ కదిలింది. ఈ చలనానికి, చైతన్యానికి దూరంగా లల్లుకుపోయిన అవయువాలు. రాబోయే ఎడబాటుకు తల్లడిల్లిపోతున్న హృదయాలు

"నీకు దూరంగా నేనుండలేను మోహన్."

"పిచ్చి రాజీ... నీవు లేందే నేనుమాత్ర ముంటానా ! నీవు ఎదురు చూస్తున్నంతలోనే తిరిగి వచ్చేస్తాగా..."

"ఈ శోభ, ఈ కన్నీళ్ళు నీ కర్థంకాదు మోహన్. నీ వొళ్ళో నకు ప్రాణం పోయినా హాయిగానే ఉంటుంది" రాజీ జుట్టును ఆప్యాయంగా నిమిరాడు మోహన్.

రంగసామిలో తిరిగి కంపరం. రాహు కేతువుల సంచలనం. దేవతలకు యుద్ధం చూట్టం సరదా. రాక్షసులకు చేయటం సరదా. రంగసామి ఎదలో అగ్నివర్షం. ఎరుపెక్కిన కళ్ళు. మనసును అదేపనిగా చిలుకుతున్న రాక్షస కాంక్షల కవ్వం. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నై. కుడిచేత్తో ముఖంమీది చెమటను తుడుచుకొన్నాడు. ఉలిదెబ్బతిన్న రాయిలా అయిపోతున్న దతని ముఖం. మళ్ళీ సడన్ బ్రేక్‌తో లారీని ఆపాడు సైడ్‌గా. మోహన్ వొడిలో వొదిగిన రాజీ తలెత్తకుండానే చికాకుపడింది.

"ఏమైంది ? ఏమైనా రిపేరా ?" అమాయకంగా అడిగాడు మోహన్.

ఆ అమాయకత్వం, ఆ నిర్మలత్వం, ఆ ప్రశాంతమైన కళ్ళు, ఆ కళ్ళనుండి చిమ్ముకొచ్చే కాంతి, ఇవే రంగసామి గుండెల్ని కోస్తున్నై. మనసును మథనతో మరగబెడుతున్నై.

"ఈడి ముకం వేపు సూడగూడదు.. నా సేతులు, బుర్ర పనిసేయటంలేదు" సణుక్కొన్నాడు రంగసామి.

"ఏం కాలే; యింజన్ ఏదన్నా ట్రబుల్ ఇచ్చిందా అని సూత్తున్నా" కరిగిపోయే మబ్బులా నిర్వీర్యమవుతూ చెప్పాడు రంగసామి.

లారీ ముందుకు కదిలింది. మోహన్ వొళ్ళో తలదాచుకొన్న రాజీ కళ్ళల్లో జలపాతాలు. అంత రంగంలో క్రమ్ముకుపోతున్న ఆవేదనా పొగమంచు. ప్రేమ — జీవాత్మల అంతరింగిక రవళికి లయగా నర్తించేదే జీవితమేమో; ఆ జీవితంలో పూచే చిరు నవ్వులు, హరివిల్లులు, లాస్యం, పారవశ్యం వీటిని పరస్పరం పెనవేసుకొంటూ పెంచుకొనేదే ప్రేమేమో.

"ఏట్టైంది నాకేఁం! నీ యవ్వ సేతులు ముందుకు రాటంలా. ఈడి బుర్రను బద్దలుసేసి ఆ మెరపును ... ఆ బొమ్మను ... తను...కసిదీరా... ఏటో దీనెమ్మ సేతులు కట్టుకుపోతున్నై. మనసు మొద్దు రాయవుతూంది. ఈ కుర్రెదవ దగ్గరేదో మంతరం ఉంది. ఆ మంతరంపెట్టే ఈడా పిల్లను కుక్కలా తిప్పుతున్నాడు ... ఆ పిల్ల ... ఆ పిల్ల ... యీడి వొళ్ళోనే ... నీ యవ్వ ... ఇటు పక్క ... నేనూ మగాన్నే ... నేను సూత్తా_న్నా ఆలోచనే లేదీపిల్లకు ... పొద్దస్తమానం ఆ డొళ్ళోనే ... ఈలిద్దరి యిసయం ... ప్రేమంటే ఇదేనా ... ? అయితే మరి లచ్చితో తాను ఎప్పుడైనా ఇట్టా గడిపాడా ... దాని బుగ్గలమీద సేయేసి ... ఆ కోరిక కప్పుడు తప్ప ... అసలు దానిమాట యిన్నాడా ... " రంగసామిలో అంతరంగ మధనం. గతానుభూతుల త్రొక్కిసలాట.

ఆలోచనల్లోనే మరో ఊరు వచ్చింది. రోడ్డు వారగ లారీని ఆపాడు. 'ఛాయ్' కోసం దిగుతూ ఆ జంటవైపు చూశాడు, వాళ్ళూ దిగుతారేమోనని. వాళ్ళీ లోకంలో లేరు. రంగసామి కరుకు హృదయం నుండి ఒక పొర విడిపోయింది రంగసామిని 'క్లీనర్' అనుసరించాడు. ఇటువంటి అవకాశాన్ని అందువా అర్థరాత్రి వేళల్లో ఏనాడూ విడిచిపెట్టని రంగసామి వేపు అయోమయంగా,అనుమానంగా చూశాడు క్లీనర్.

"ఏటి గురూ ... ఇట్టా సేశావ్ ... ఏ టయిమప్పుడు సైగ చేత్తా_నా అని కళ్ళిట్లానే పెట్టుకొని కాబిన్‌పైన కూకుండా" తన తప్పులేదన్నట్లుగా చెప్పాడు క్లీనర్.

"దేనికిరా పిలవటం నిన్ను ?"

"దేనికేటి గురూ ... ఆ పిల్ల ... "

"ఛవ్ ... నోరెత్తకు ... పిసికేత్తా; అల్లు కొత్తగా మనువాడినట్టున్నారా...అల్లని ఎడదీయటం కిరాతకం" ముందుకడుగులేస్తూ అన్నాడు రంగసామి.

"గురూ సెడిపోయాడు" నిర్ధారించుకొని గిల్లగిల్లాడిపోయాడు క్లీనర్; మృగరాజు నాశ్రయించే అల్ప జీవాలకు వేటలో అంతో ఇంతో భాగం దొరుకుతుంది గదా;

రంగసామి చేతిలో ఛాయ్‌గ్లాసు. ఆ గ్లాసులో లచ్చి రూపం. ఈ తఫా ఆ 'ఛాయ్'ని పారబోయ లేదు రంగసామి. లచ్చి రూపాన్నే చూస్తుండి పోయాడు.

"మామా ... నీకు దండం పెడతా; నన్ను కొట్టు, తిట్టు, సంపు ... నీ యిట్టం ... నన్ను మాత్తరం యీడనుండి పంపకు ... " కాళ్ళు పట్టుకు ప్రాధేయపడుతూ లక్ష్మి. తన రాతి గుండె మీద నీళ్ళు చల్లినట్లుగా అన్పించినై ఆ మాటలు.

"నా యవ్వారాల్లో యేలొట్టద్దని సెప్పీ సెప్పీ యిసిగిపోయా ... ఇక కుదర్దు ... నీకూ . నాకూ ఎట్టాట్ట పొసగూ కుదర్దు ... నీ పుట్టింటి కాడకెల్లు."

"మామా ... మామా ... పుట్టింటికాడకు మాత్తరం పోలేను ... సుట్టూజేరి పరాసికా లాడతారు ... ఆ నరకం నాకొద్దు మామా ... యీడనే నీ కాల్లకాడనే పడివుంటా."

"లే నీయవ్వ... లేదా నరికేత్తా ముక్కలు ముక్కల గా."

"నరుకు మామా... నాకదే సంతోసం."

"కూతలు నేరిసింది పిట్ట" తన కాళ్ళు పట్టుకొని గింజుకొంటున్నా బలవంతాన లచ్చిని బయటకు గుంజి... రిక్షా ఎక్కించి..."

బుర్ర పట్టుకొన్నాడు రంగసామి. గతం కొలుకుతింటున్నది. ఆత్రంగా ముందున్న చాయిని తాగాడు. కాళ్ళల్లో వణుకు. గుండెల్లో ఏదో మూల కలుక్కుమంటున్నది. లారీ వద్దకు వచ్చాడు రంగసామి.

లారీ దూసుకుపోతున్నది. చీకటి చెదిరి పోతున్నది. వేకువ రేకులు విచ్చుకొంటున్నై.

"ఇక్కడాపు... ఆటోమీద వెళ్ళిపోతాం" అచేతనంగా లారీ ఆపాడు రంగసామి.

"ఎంతివ్వాలి ?" పర్సు చేతిలోకి తీసికొంటూ అడిగాడు మోహన్.

"ఏం అవుసరం లేదు... ఎల్లిరండి..." రంగసామిలో మొలకెత్తబోతున్న ప్రసన్నత.

"ఎంతో కొంత తీసికో"వత్తిడి చేయబోయాడు మోహన్.

"ఏం యీయాయనవుసరంలేదు. జల్దీ దిగండి బాబూ. నాకు మల్లా రిటన్ టైం అవుతున్నది."

కృతజ్ఞత తెల్పుకుంటూ లారీ దిగాడు మోహన్. మోహన్ చేతుల్ని ఆసరా చేసుకొని రాజీ గూడా దిగింది. లారీ కదిలింది.

"గురువు పూర్తిగ సెడిపోయాడు" గొణుక్కున్నాడు క్లీనర్.

లోడు దింపుకొని ఆ సాయంత్రమే వెనుదిరిగి.. లారీ కాబిన్‌లో రంగసామి కుడి ప్రక్కన ఉన్నదెవరో చూడండి; సాక్షాత్తూ లచ్చి. వస్తూ వస్తూ దారి మధ్యలోనే ఉన్న తన అత్తగారి ఊరువైపుకు లారీ మళ్ళించి మరీ లచ్చిని కాపురానికి తరలి రమ్మన్నాడు. రంగసామి వచ్చినందుకే పొంగిపోయిన లచ్చి, అతడే స్వయంగా ఆహ్వానించటం చూసి లచ్చి ఆనందంతో కన్నీరు కార్చింది. ఆకాశంలో తేలిపోయే మబ్బుల్లా ఆమె మనసులో సంబరాల తాలూకు ఊగిపోయే ప్రభలు.

"లచ్చి ! ఎట్టున్నది ?" లచ్చి భుజంమీదగా తన కుడిచెయ్యి వేసి దగ్గరకు తీసికొంటూ అడిగాడు రంగసామి.

"ఏటి ?"

"ఈ లారీలో ... ఇట్టా ... మనిద్దరం ... "

రంగసామి మనసు రావరిస్తున్న అనుబంధాల తీయని స్మృతులు.

"గుండెంతా సంతోసంతో నిండిపోతంది మామా ! జల్మ జల్మలూ ఇట్టానే నీతో ఉండి పోనియ్యాల ఆ దేవుడు" రంగసామి భుజంమీద తల ఆన్చి అరమోడ్పు కన్నులతో అంది లచ్చి.

కాలం పొరల మాటున, కనురెప్పల కలల అలల క్రింద జీరాడే అంధకారాలు, వెన్నెలలు; వేడుకలు, నిట్టూర్పులు, కన్నీళ్ళు, నవ్వులు, వసంతాలు, వడగాడ్పులూ; ఇవన్నీ ఈ అనంత జీవన యాత్రలో కలసి మనుగడ సాగించే భాగ స్వాములేమో; ఏ పరుసవేది స్పర్శకో ఎప్పుడైనా నోచుకొంటే ఇత్తడి పుత్తడైనట్లు విషమే అమృత మవుతుందేమో !

★